# ఉద్యోగి

సర్వజిత్

**"ఈ జనాన్ని ఎవరూ బాగుచేయలేర్రా!" అన్నాడు మూడోసారి లోవరాజు, ఆరోసారి పెదవి విరుస్తూ.**

"సారా తాగితే ఒళ్లూ, ఇళ్లూ గుల్లయిపోద్ది. సారా మానండి. సారాను నిషేధించాం. అన్నారు సర్కారోళ్లు. మనవంతా జిందాబాద్ అన్నాం. ఏటయ్యింది!? మీరు గుల్లయిపోతే మాత్రం మేమేం జెయ్యలేం. గవర్నమెంటోడి గల్లాపెట్టిలో చిల్లుగవ్వలేదు. అంచేత సారామీద నిషేధం తీసేత్తన్నాం. మీరు సారా దండిగాతాగేసి మా గల్లాపెట్టి నింపండి అని గవర్నమెంటోళ్లు అనేశారు. ఇప్పుడూ మనం జిందాబాద్ అనేశాం. నిషేధం పెట్టడమూ, తీసెయ్యడమూ ఆళ్ల ఇష్టమే గనక మేమేం జెయ్యలేం అని కోర్టోళ్లు చేతులు దులిపేసుకున్నారా? ఇప్పుడూ జనానికేం పట్టలేదురా... ఛి ఛి! ఈ జనాన్ని ఎవరూ బాగుచెయ్యలేరు!"

ఉపోద్ఘాతం ఇచ్చి నాలుగోసారి మళ్లా బాధపడిపోయాడు లోవరాజు.


"జనాల సంగతి సరే, ముందు మనసంగతి సూడు. పెద్దోడికి కాలేజీలో సీటయితే వొచ్చింది. ఫీజులు కట్టాలి. పుస్తకాలు కొనాలి. ఆడు సైకిలంటున్నాడు. చిన్నదానికీ సైకిలంట..." లోవరాజు భార్య సీతారత్నం సణుగుతూ, సాధిస్తూ తక్షణావసరాలను గుర్తుచేసింది లోపల్నుంచి.

లోవరాజు అదేం పట్టనట్లు నటిస్తూ వింటున్నాడు. వింటూ ఆలోచిస్తున్నాడు.

ఇప్పట్లో ఎన్నికలేమీ లేవు జెండాలట్టుకు తిరగడానికి. అన్నిరకాల ఎన్నికలూ అయిపోయి, పదవులకోసం మ్యూజికల్ చైర్స్ ఆడుకుంటున్నారు. ఇప్పుడు వాళ్లకి లోవరాజులాంటి వాళ్లతో పని లేదు. ఏవైనా ఉద్యమాలు వచ్చి ప్రభుత్వాలు పడిపోతాయనుకుంటే సమీప భవిష్యత్తులో అలాం టి అవకాశమూ కనిపించడంలేదు.

ఇది లోవరాజుకి ఇబ్బందిగా ఉంది. దేశం సుభిక్షంగా ఉండకూడదు.

బంద్‌లు, సమ్మెలు వగైరా ఉద్యమాలు తీవ్రస్థాయిలో సాగుతూండాలి. అప్పుడే



లోవరాజులాంటి వాళ్లకి మూడు పువ్వులు ఆరుకాయలుగా సాగుతుంది జీవితం.

లోవరాజు ఉద్యోగం లేని ఉద్యోగి. నీరులాంటివాడు. ఒకరూపం లేని వాడు. పాలల్లో కలిపినా, ఫినాయిల్‌లో కలిపినా ఇట్టే కలిసిపోతాడు.

ఇజాలు, భేషజాలు అతనికి పట్టవ్. అలాంటి హద్దుల్లో మడిగట్టుకునే రకం కాదు. అన్ని పార్టీల జెండాలు పట్టుకుని అవసరాన్నిబట్టి ముందో, వెనకో నిల్చుంటాడు.

లోవరాజు ఎక్కడుంటే అక్కడ పదిమంది ఉంటారు. ఎందుకంటే అతడు వాళ్లందరికీ చాయ్ పోయిస్తాడు. సిగరెట్లిప్పిస్తాడు. టిఫిన్లు పెట్టిస్తాడు. చిన్నా, పెద్దా అనేది లేకుండా అందరి భుజాలమీద చేతులేసి పలకరిస్తాడు.

ఈమధ్యనే లోవరాజులో కాస్త నాజూకుతనం వచ్చింది. ఇస్త్రీ బట్టలేసుకుని తిరుగుతున్నాడు.

సీతారత్నాన్ని పెళ్లి చేసుకున్నప్పుడు లోవరాజుకి ఒక చొక్కా, ఒక పాంటు-అవికూడా సెకండ్‌హాండ్‌లో పేవ్‌మెంటుమీద కొన్నవి ఉండేవి. ఇప్పుడు అతనికి వి.ఐ.పి. సూట్‌కేసునిండా బట్టలున్నాయి.

'తాడూ బొంగరం లేని పేవ్‌మెంటుగాడికి పిల్లనెలా ఇస్తాం' అని సీతారత్నం తల్లిదండ్రులు లోవరాజుకి పిల్లనివ్వడానికి ససేమిరా ఒప్పుకోలేదు ఒకప్పుడు. అన్నారే గాని అంతకన్నా మంచి సంబంధం తేవడం వాళ్లవల్లా కాదు. అందుకే సీతారత్నం లోవరాజు భార్య అయింది.

అప్పుడు చామనచాయ నలుపులో, మోకాళ్ల దిగని చీరలో ఎబ్బెట్టుగా ఉండే సీతారత్నం ఇప్పుడు పందో, సూట ఏభయ్యో బ్యూటీక్రీములు వాడినట్లు కొంచెం నాజూగ్గా తయారయింది. ఇద్దరు పిల్లలకీ మమ్మీ, డాడీ చదువులే చెప్పిస్తున్నాడు లోవరాజు.

కాలవగట్టున పాకలో ఉండే లోవరాజు ఇప్పుడు ఓ పెంకుటింట్లో ఉంటున్నాడు. టీ.వీ.వంటి హంగులూ ఉన్నాయి.

నల్లరాజు అనబడే లోవరాజు ఇప్పుడు 'లోవరాజూ' అని పిలిపించుకుంటున్నాడు. సిటీలో ఏ పార్టీవాళ్లకి ధర్నాలు వగైరాలకు మనుషులు కావాలన్నా లోవరాజు అనుచరుల అవసరం ఉంది. అలాంటిది ...

బొత్తిగా నెలా రెణ్నెల్లనుంచి ఏ పనీ లేక అసహనంగా ఉంటున్నాడు లోవరాజు. అందుకే ఇంటిముందు అరుగుమీద కూర్చుని జనం గురించి బాధపడిపోతున్నాడు.

తిరిగే కాలు, తిట్టేనోరు ఊరికే ఉండలేవన్నట్లు లోవరాజు ఊరికే ఉండలేదు.

తక్షణం పని కల్పించుకోవాలన్నదే అతని ఆలోచన. ఏ చిన్న గొడవ దొరికినా దాన్ని చిలవలుపలవలుగా పెంచి పెద్ద చెయ్యగల నేర్పు అతడికి వెన్నతో పెట్టిన విద్య.

అందుచేత వారంరోజులనుంచీ ఆలోచిస్తున్నాడు లోవరాజు. హడావుడి చెయ్యడానికి అతనికి ఏ సమస్యా కనిపించడంలేదు.

జనంమీద మా చెడ్డకోపంగా ఉందతనికి.

వారంకిందట వన్‌టౌన్‌లో సోడాబుడ్లు విసురుకుంటూ రెండువర్గాలు తీవ్రస్థాయిలో ఘర్షణ పడుతున్నారని తెలిసి లోవరాజు ఆఘమేఘాలమీద అక్కడికి వెళ్లాడు.

ఒకవర్గాన్ని భుజాన వేసుకుని హడావుడి చేసి ఆనక 'ఇంత' గుంజుకుందామనుకున్నాడు. కానీ అతని ఆలోచన పారలేదు. అప్పటికే పోలీసులు రంగప్రవేశం చేసేసి, ఆ పనేదో వాళ్లే చూసుకున్నారు.

పోలీసులమీద అప్పుడతనికి పట్టరానంత కోపం వచ్చేసింది.

"ఏరా అబ్బులూ! ఇసేసాలేం లేవా?'' అడిగాడు లోవరాజు వందిమాగధుల్ని కలయచూస్తూ.

తమ గురువుగారికి పనిలేకపోవడం వాళ్లకీ ఇబ్బందిగానే ఉంది. ఇప్పుడు వాళ్లకి వచ్చిన పనులు హోటల్‌లో సప్లయర్లుగానో, క్లీనర్‌లుగానో, సినిమా థియేటర్ల దగ్గర బ్లాక్ టిక్కెట్లు అమ్మేవాళ్లుగానో తప్ప ఇంకేమీ రావు పాపం!

"మొన్న రాంగుండు సెంటర్‌లో మానభంగం జరిగిందంట!'' నర్సిగాడు యథాలాపంగా అన్నాడు.

అంతే ఎడమవైపు కూర్చున్న వాడి తలమీద టక్కున జెల్లకాయొకటి ఇచ్చాడు లోవరాజు. వాడు బిత్తరపోయాడు.

"ముక్యయిసయం ఇంత తాపీగా చెబుతావ్రా .... ఛూ!'' లోవరాజు తిట్టాడు.

నర్సిగాడు కంగారుపడ్డాడు.

"చేసినోడెవడు? చేయించుకున్నదెవత్తి? ఆ యిసయాలు చెప్పిచావు!'' గర్జించాడు లోవరాజు.

రాంగుండు సెంటర్‌లో బడ్డీ హోటల్ నడుపుతున్న అప్పలస్వామి పద్నాలుగేళ్ల కూతురిపై ఇద్దరు అత్యాచారం జరిపారు.

పద్నాలుగేళ్లకే ఆమె నందివర్ధనంలా ఎదిగిపోయింది. హోటల్లో సప్లయ్‌లు చేస్తూ వగలుపోతుంటుందని అంటూంటారు చూసినవాళ్లు.

ఏది ఏమైనా రేప్ నేరం. అది జరిగినమాట నిజం. కానీ అది బయటపెట్టుకుని మరింత అల్లరిపడటం ఇష్టంలేక, ఆ బడబాగ్నిని


## వాత్స్యాయన కామసూత్రాలు

కామ శాస్త్ర గ్రంథాలలో వాత్స్యాయన కామసూత్రాలదే అగ్రస్థానం. అనుభవజ్ఞులైన పెద్దలు, సెక్స్ సైంటిస్టులు, సైకాలజిస్టులచే ప్రశంసింపబడిన ఈ సంస్కృత గ్రంథం ప్రపంచ భాషలన్నింటిలోనికి అనువదించబడినది.

"కృతే ప్రతికృతం కుర్యాత్తాడితే ప్రతి తాడితం తామ్
కరణేనచ తేనైవ చుంబితే ప్రతి చుంబితమ్''

పరిచయకాలంలోనూ, సంభోగ కాలంలోనూ పురుషుడు ఏ రకమైన ముద్దులు ప్రయోగిస్తే, స్త్రీ అదే రకమైన ముద్దులు ప్రయోగించాలి. అపుడే అది ఒకరితో ఒకరు కాలంతో నిమిత్తం లేకుండ మానసికంగా, శారీరకంగా కలసిపోయే శృంగారం. కాని యువతి ఆరకంగా ప్రవర్తించకపోతే 'ఆమెకు శృంగారం తెలియదని' పురుషుడు ఆమె పట్ల విరక్తి చెందుతాడు. ఆమెపై గల ఇష్టాన్ని, ప్రేమను, క్రమంగా కోల్పోతాడు. ప్రేమను వ్యక్త పరచటంలో నేర్పు గల వారే ప్రేమించబడతారు. ఇటువంటి మరెన్నో విషయాలను ప్రతి ఒక్కరు అర్థం చేసుకొని ఆచరించడానికి వీలుగా రచించిన పుస్తకమే వాత్స్యాయన కామ సూత్రాలు.

## వాత్స్యాయన కామసూత్రాలు

కొత్త, కొత్త ప్రారంభాలు - చిత్రమైన బంధాలు - చిత్రమైన ముగింపులు - మీకు తెలియని ఎన్నో విధానాలు మీరు ఇంతవరకు గ్రహించని ఎన్నో భావాలను సందర్భానుసారంగా రేఖా చిత్రములతో సమగ్రంగా వివరించి మీ భాగస్వామి కన్నులలో సంతృప్తిని మీచే చూపించి మీ మధ్య ప్రేమానుబంధాలను పెంపొందింప చేసేదే ఈ వాత్స్యాయన కామసూత్ర రచన (తెలుగు).

మనం ప్రస్తుతం పొందుతున్న ఆనందాన్ని పదిరెట్లు, వంద రెట్లుగా సహజంగా పెంచుకోవడం వాత్స్యాయన కామసూత్రాలను తెలుసుకోవటం వలననే సాధ్యం. **(పుస్తకం గురించిన మరిన్ని వివరాలు కావాలంటే రూ. 2/- స్టాంపు అంటించిన మీ స్వంత చిరునామా గల కవరు పంపండి).**

అమితమైన కామ సుఖాలను అనుభవించటానికి, జీవితాన్ని మరింత ఆనందమయం చేసుకోవటానికి అర్హత ఉన్న ప్రతి ఒక్కరు కామసూత్రాలను తెలుసుకోవాలి. వాత్స్యాయన కామసూత్రాలు ప్రతి జంటకు జీవితాంతం మార్గ దర్శకంగా ఉంటాయి. ఇది పెద్దల మాట .... మానసిక శాస్త్రవేత్తల మాట .......... మరి మీ మాట .............. **ముందుగా డబ్బు పంపనవసరం లేదు. సీలు చేయబడిన కవరులో పుస్తకం V.P.P. లో మీకు చేరినాక (ధర రూ. 285/-) డబ్బు చెల్లించవలెను.** మరి ఇక ఆలస్యమెందుకు ? నేడే ఈ కూపన్ క్రింది అడ్రస్‌కు పంపండి. లేదా పోస్టు కార్డు వ్రాయండి.

**బృందా పబ్లికేషన్స్**

పోస్ట్ బాక్స్ నెం. 14, కృష్ణానగర్, కర్నూల్ - 518 002.

వాత్స్యాయన కామసూత్రాల పుస్తకము రూ. 285/- లకు V.P.P. ద్వారా పంపండి, పోస్టుమెన్‌కు డబ్బు చెల్లించి V.P.P. తీసుకుంటాను.

పేరు ------------------------------------

చిరునామా ------------------------------------

గుండెల్లోనే దాచుకున్నారు అప్పలస్వామి దంపతులు.

ఇంక ఆ పిల్ల హోటల్లోకి రాకుండా కట్టుదిట్టం చేసేశారు.

తీగలాగి, డొంకంతా కదలేసి విషయం తెలుసుకున్న లోవరాజు అరగంటలో అప్పలస్వామి హోటల్లో వాలాడు తన మందీమార్బలంతో.

"ఎవడ్రా నీ కూతుర్ని పాడుచేసింది?" అంటూ అప్పలస్వామిని వాటేసుకుని కళ్లనీళ్ల పర్యంతం చేశాడు.

జరిగిందేదో జరిగిపోయిందని, ఇంక ఆ విషయం మీద రాద్ధాంతం చెయ్యొద్దని, అది తమ ఖర్మ అనుకుంటామని ఆ దంపతులు ముక్కుచీదుకున్నారు. లోవరాజు వినలేదు.

"నీ కూతురొకటి, నా కూతురొకటీనా! నీ కూతురు బంగారం. మాలచ్చిమి. మాలచ్చివికి అన్యాయం జరిగితే సూత్తూ ఊరుకోమంటావా? ఈ జన్మ ఎవడికోసం రా! మీ కోసం! ఇదే పెద్దింటోళ్లకి జరిగితే ఊరుకుంటారా? సుప్రీం కోర్టుకెళ్తారు. నువ్వేం జెప్పినా ఇనేది లేదు. ఇది అన్యాయం. అన్యాయాన్ని ఎదిరించాలి. ఇప్పుడు పాడుచేసేరు. ఊరుకుంటావు. రేపు కడుపు చేసేత్తారు. అప్పుడూ ఊరుకుంటావా? పిచ్చిమొకమా! చెప్పేది ఇనుకో! నీ ఎనక నే ఉన్నాను. నా ఎనక జనం ఉన్నారు. ఈ ఇసయం ఇలా వదిలెయ్యకూడదు!"

అప్పలస్వామికి హితబోధ చేశాడు లోవరాజు. అతని గుండెల్తో మంటని కాస్త రగిలించాడు. అప్పలస్వామి భార్య దగ్గరకెళ్లాడు.

"నువ్వు జెప్పు, చెల్లమ్మా! ఇలాంటి నికృష్టపోళ్లని... అంటే మీ అమ్మాయి ని పాడుజేసినోళ్లని... ఆ దగుల్బాజీగాళ్లని అచ్చోసిన ఆబోతుల్లా ఊరిమీదకి వదిలెయ్యాలా? బుద్ధిచెప్పాలా? నే చెప్తున్నా వినుకో, ఈ అన్యాయాన్ని ఊరుకునేది లేదు. హై లెవెల్లో దీని సంగతి చూడాల్సిందే. నీ కూతురికి రేపో మాపో పెళ్లి చేయాలి కదా! పెళ్లంటే డబ్బుండాలా? డబ్బు సరిపోద్దా? ఏ కిట్టనోడో అమ్మాయికి జరిగిన అన్యాయం రగస్యంగా చెవులో ఊదేశాడనుకో, అప్పుడేటౌద్ది? పెళ్లి జరుగుతాదా? అంచేత అన్నీ ఆలోచించి చెబుతున్నాను. అమ్మాయికి ప్రభుత్వం నుంచి నష్టపరిహారం ఇప్పించాలి. ఆ ఎదవల్ని బొక్కలో తోయించాలి. అంతవరకూ నేను నిద్రపోను!"

లోవరాజు సుదీర్ఘంగా ఎన్ని మలుపులో తిప్పి తిప్పి చెప్పేసి గ్లాసుడు మంచినీళ్లు తాగాడు. అప్పలస్వామి ఇచ్చిన స్పెషల్ టీ తాగాడు.

ఆ తరువాత ఆ దంపతులిద్దర్నీ మార్చి మార్చి చూశాడు.

అప్పలస్వామి ముఖంలో కసి, కోపం, నష్టపరిహారం ఆశ... దోభూచు లాడుతున్నాయి. అతని భార్య పరిస్థితీ అలానే ఉంది.

"డబ్బుంటే ఎలాంటి మచ్చనైనా కడిగేసుకోవచ్చు!" అన్నారెవరో.

ఏం చెయ్యాలో తోచక అప్పలస్వామి దంపతులు ఆలోచనల్లో కొట్టుమిట్టాడుతుంటే... జేబులోంచి కాగితాలు తీశాడు లోవరాజు. నిజానికి లోవరాజు అంతా సిద్ధం చేసుకునే వచ్చాడు.

"ఇక్కడ సంతకం పెట్టు అప్పలస్వామీ! ఇది కలెక్టర్‌కి మెమోరాండం. ఇది ఎస్.పి.కి. మనోళ్లతో ఊరేగింపుగా వెళ్లి ఇద్దాం!" లోవరాజు చెప్పాడు.

అప్పలస్వామి భార్యకేసి చూశాడు. ఆమె లోవరాజుకేసి చూసింది. కొద్ది క్షణాలు అందరూ నిశ్శబ్దంగా ఉండిపోయారు. పెన్ను వెతుక్కుని అప్పలస్వామి ఆ కాగితంమీద సంతకం చేశాడు.

"సాయంత్రం ఊరేగింపు!" లోవరాజు ప్రకటించాడు.

+++

వారం రోజులయింది.

లోవరాజు తాజాగా మొదలెట్టిన అప్పలస్వామి కూతురు అత్యాచారం ఉద్యమం పుంజుకుంది.

ఛోటానాయకుల దగ్గర్నుంచి కొంచెం బడా నాయకులదాకా అత్యాచారం సంఘటనను ఖండిస్తూ(తీవ్రంగా)ప్రకటనలు ఇప్పించాడు లోవరాజు. వాళ్లకీ వేరే పనులు లేవు గనక, రోజూ వాళ్ల పేర్లు పేపర్లలో ఏదోరూపంలో కనిపించాలి గనక అడిగినదే తడవుగా ఖండిస్తూ ప్రకటనలు ఇచ్చేశారు.

నిందితులను అరెస్టు చేయిస్తానని ఎస్.పి. హామీ ఇచ్చేశాడు. దాంతో నిందితుల దగ్గర్నుంచి లోవరాజుకి రాయబారాలు ప్రారంభమయ్యాయి. రాజీ చర్చలు సాగాయి.

లోవరాజుకి ముట్టాల్సిందీ, అమ్మాయికి ఇవ్వాల్సిందీ, అమ్మాయికి ఇచ్చేదాంట్లో ఖర్చులకిగాను లోవరాజుకి దక్కాల్సిందీ ఒప్పందాలు కుదిరిపోయాయి.

అధికారపార్టీలో ఉన్న నిందితుల తరపు బంధువొకాయన సిఫార్సులతో బాధితురాలు, అప్పలస్వామి కూతురికి ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయంగా పదివేల రూపాయలు మంజూరైపోవడమూ జరిగింది.

ఆఫీసర్ల చుట్టూ, గుమాస్తాల చుట్టూ లోవరాజు తిరిగి నష్టపరిహారం సొమ్ము అందుకుని, అందులోనూ తన వాటా తీసుకుని ఐదువేలు అప్పలస్వామి చేతిలో పెట్టి భుజం తట్టాడు.

ఆ ప్రకారం లోవరాజు ఉద్యమం ముగిసింది. అతని ఇంటి సమస్యలు తీరాయి.

జరిగిన అనర్థాన్ని గుండెల్లో దాచుకున్న అప్పలస్వామి దంపతులు ఇవ్వాళ పదిమందిలోనూ పడ్డారు. వాళ్ల అమ్మాయి గురించి పేపర్లనిండా పాకి అందరికీ తెలిసి బజారు బతుకయింది.

లోవరాజు అగ్నిప్రమాదసంఘటనను తీసుకుని కొత్త ఉద్యమం ప్రారంభించాడు. ■

